క్లుప్తంగా

మిషన్ భగీరథ నీరు కలుషితం


కలుషిత నీరు

హత్నూర(సంగారెడ్డి): మిషన్ భగీరథ నుంచి మురికి నీళ్లు వస్తున్నాయని మండల కేంద్రం హత్నూర, పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధిచేసిన మంచినీటి ప్రజలకు సరఫరా చేయాల్సి ఉంది. కలుషిత నీటిని ఏలా వాడుకోవాలని వాపోతున్నారు. నాలుగు రోజులుగా నల్లాల ద్వారా కలుషిత నీరు వస్తుందన్నారు. అధికారులు స్పందించి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


ఇళ్ల పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి ముంగి తండాల్లో శనివారం ఎంపీడీఓ శ్రీనివాస్ పర్యటించారు. తండాలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఇంటి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని వారికి సూచించారు. అలాగే నర్సరీని పరిశీలించి.. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు సరఫరా చేశారు? ఇంకా ఎన్ని మొక్కలు మిగిలి ఉన్నాయనే వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఎంఈఓ శంకర్ తెలిపారు. శనివారం మండలంలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో రక్తహీనతను నిరోధించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు వైద్యులు ఆరోగ్య చిట్కాలు తెలపారు. కార్యక్రమంలో హెచ్ఎం సందీప్ కుమార్, డాక్టర్ గౌరీ శంకర్, సీఆర్పీ రాజేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గణేశ్ గడ్డ ఉత్సవాలు


వివిధ రకాల పండ్ల అలంకరణలో గణనాథుడు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని గణేశ్‌గడ్డ దేవాలయ ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్, జగదీశ్వర్ స్వామి,అయ్యప్ప, సతీష్‌లు అభిషేకం నిర్వహించి, వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

శోభాయాత్రలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

సంగారెడ్డి క్రైమ్: వినాయకుడి శోభాయాత్రలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని శాంతినగర్ కాలనీలో తమ వినాయకుడు ముందు వెళ్లాలని, లేదు లేదు తమ వినాయకుడే ముందు వెళ్లాలని ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరువర్గాల దాడులు చేసుకునే అవకాశం ఉందని గ్రహించిన పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించారు. శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహింకుందామని కాలనీ ఇరువర్గాల పెద్దలకు పోలీసులు సూచించారు. ఘటనపై వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

వినాయకా.. సెలవిక!

వినాయక నిమజ్జన ఉత్సవాలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఉత్సహంగా సాగాయి. వాడవాడలా నిమజ్జన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. డీజే మ్యూజిక్, టపాసులు కాలుస్తూ, యువకుల నృత్యాలతో హోరెత్తించారు. అడుగడుగునా దాతలు నీరు, అన్న ప్రసాదాలను భక్తులకు అందించారు. అర్ధరాత్రి తరువాత గుణనాథుడిని నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


జహీరాబాద్ టౌన్ : పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్తున్న వినాయకుడు


ఉభచెరువులో నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు


ఐబీ గెస్ట్‌హోస్ వద్ద నృత్యం చేస్తున్న యువకులు


సదాశివపేట: భజన చేస్తున్న భక్తులు


సదాశివపేట: శోభయాత్రను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు


గంగమ్మ ఒడికి చేరుకుంటున్న వినాయకుడు


సంగారెడ్డిలో గణేశ్ శోభాయాత్ర


సంగారెడ్డి : నృత్యం చేస్తున్న యువకులు

ఘనంగా పీర్ బాబాన్ సాబ్ ఉత్సవాలు

- ఒంటెలు, గుర్రాలపై పీఠాధిపతి ఊరేగింపు
- గంధంతో దర్గా వద్ద ప్రత్యేక పూజలు

పుల్‌కల్: కులమతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవాల్లో భక్తులు పాల్గొలని దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబిద్ హుస్సేన్ సత్తారుల్ ఖాద్రి సాహెబ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం పరిధి సింగూర్ గ్రామంలోని దర్గా వద్ద గత రెండు రోజులుగా హజరత్ మహమ్మద్ బాబాన్ షావలీ దాదా హజాద్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరై పూజలు చేశారు. శనివారం సాయంత్రం పీఠాధిపతిని ఇంటి నుంచి గంధం (సందల్) ఒంటెలు, గుర్రాల పైన కూర్చోబెట్టి బ్యాండ్ మేళాలతో గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించగా 18 టీంలు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా టేకుర్ దర్గా ఇంతియాజ్ సాహెబ్, జహీరాబాద్ దర్గా హరుణ్ సాహెబ్, బోడ్మట్‌పల్లి హషం సాహెబ్, సద్దాం సాహెబ్ కర్ణాటక, గౌస్ సాహెబ్ కర్ణాటక పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో గోవర్ధన్, రామచందర్ రెడ్డి, అంజయ్య, సంగమేశ్వర్, వీరారెడ్డి, గంగారాం, మధుసూదన్, నాగరాజు, దత్తు సింగూర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో ఒంటెపై ఊరేగిన పీఠాధిపతి

హోరాహోరీగా సాగిన లడ్డూ వేలం


లడ్డూతో తోపాజి హరీశ్


లడ్డూను సొంతం చేసుకున్న విశాల్ రెడ్డి

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ మాత ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూ వేలం పాటలో భారీ ధర పలికింది. హోరాహోరీగా సాగిన వేలం పాటలో తోపాజి అనంత కిషన్ కుమారులు, తోపాజి హరీశ్, రోహిత్ రూ. 1,25,116లకు దక్కించుకున్నారు.

లడ్డూ రూ.3.60లక్షలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రారెడ్డినగర్ కాలనీలో వినాయక మండపం వద్ద వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. పురుషుల విభాగం లడ్డూను రూ.3.60లోలకు విశాల్ రెడ్డి సొంత చేసుకున్నారు. మహిళా విభాగం లడ్డూను రూ.2లక్షల60వేలకు వనజ రెడ్డి సొంత చేసుకున్నారు.

గుమ్మడిదలలో రికార్డు ధర

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని చెట్లపోతారం గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో మద్దూర్ పటేల్ బాలయ్య లక్ష 65 వేలకు సొంతం చేసుకున్నారు. అదేవిధంగా గుమ్మడిదల పట్టణ పరిధిలోని అన్నారం గ్రామంలో మాజీ సర్పంచ్ మురళి ముచ్చటగా మూడోసారి గణపతి లడ్డూను వేలంపాటలో 2 లక్షల 55 వేలకు దక్కించుకున్నారు. గుమ్మడిదలలో గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత ప్రభాకర్‌రెడ్డి గణేశ్ లడ్డూను రూ.4 లక్షలకు సొంతం చేసుకున్నారు.

గణేష్ గడ్డ దేవస్థానంలో..

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం గణేశ్‌గడ్డ దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు శనివారం సాయంత్రం గణనాథుడి మూడు లడ్డూలను వేలం వేశారు. పోటాపోటీగా సాగిన ఈ వేలం పాటలో మొదటి లడ్డూను తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లికి చెందిన సాయి చరణ్ గౌడ్ రూ.7లక్షలకు, రెండవ లడ్డూను రామచంద్రాపురం పట్టణానికి చెందిన వరుణ్ రూ.3 లక్షల 40 వేలకు, మూడవ లడ్డూ రుద్రారం గ్రామానికి చెందిన రామారావు రూ.2 లక్షల 50 వేలకు దక్కించుకున్నారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

జిన్నారం(పటాన్‌చెరు): గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరగాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు ఆదేశించారు. శనివారం బొల్లారం పట్టణ పరిధిలోని మాధవానికుంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిమజ్జన సందర్భంగా ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కిషన్, సీఐ రవీందర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

క్రీడాపోటీలకు ఎంపిక

హత్నూరరూసంగారెడ్డి): హత్నూరలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులు జిల్లాసాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల హత్నూరలో నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీల్లో అండర్- 14,17, కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్14, 17 ఖోఖో విభాగంలో సైతం ప్రథమస్థానం సాధించి జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ పీఈటీ ప్రశాంత్ గౌడ్, పీడీ సుభాశ్‌లు అభినందించారు.

అభ్యంతరాలు తెలపండి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఓటరు జాబితాలను గ్రామ పంచాయతీలు మండల అభివృద్ధి కార్యాలయాల్లోని నోటీసు బోర్డులలో ప్రదర్శించాలని ఎంపీడీఓ ఉమాదేవి పేర్కొన్నారు. ప్రచురించిన జాబితాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఇవ్వాలని సూచించారు.

నేడు ఆలయం మూసివేత

జహీరాబాద్ టౌన్: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం పట్టణ సమీపంలోని ప్రసిద్ధ శ్రీసిద్ధేశ్వర ఆలయాన్ని మూసి వేస్తున్నట్లు ప్రధాన అర్చకులు సంగమేశ్వరస్వామి శనివారం ప్రకటనలో తెలిపారు. చంద్రగ్రహణం వల్ల మధ్యాహ్నం 1 గంట నుంచి 8 తేదీ వరకు ఆలయం మూసి ఉంటుందన్నారు. గ్రహణం వీడిన తరువాత సోమవారం ఉ.6 గంటల నుంచి స్వామివారి దర్శనం తిరిగి ప్రారంభమవుతుందని చెప్పారు.

మంచినీటి సమస్య పరిష్కారం

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): మండలంలోని తంగడపల్లి గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి సహకారంతో శనివారం పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా గ్రామంలో మంచినీరు సరఫరా నిలిచిపోవడంతో గ్రామ నాయకులు రాజు, రమేష్, నవీన్ టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించడంతో గెట్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టి మంచినీటిని సరఫరా చేశారు.

ఘనంగా అనంత చతుర్థి


ఒత్తులు వెలిగిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో శనివారం అనంత చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు ప్రవీణ్‌చారి, మోహన్ జ్యోషి, మనోజ్ జ్యోషిలు అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఒత్తులను వెలిగించారు. అరుదుగా అనంతపద్మనాభ మందిరం ఉండటంతో భక్తులు తరలివచ్చారు.

మాజీ సర్పంచ్ మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి ఇబ్రహీంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ వీరశెట్టి పాటిల్(60) మృతి చెందారు. వీరశెట్టి పాటిల్ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అంత్యక్రియలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, అభిమానులు హాజరై నివాళులర్పించారు. వీరశెట్టి పాటిల్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు 2001లో టీడీపీ మద్దతుదారుడిగా గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


పల్లకీ సేవలో ఎమ్మెల్యే, నాయకులు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కర్దనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సిద్ధి వినాయక ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీడీఎల్ సీఐ విజయ్ కృష్ణ, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్‌రెడ్డి, వడ్డే కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గ్రామంలో సిద్ధి గణపతి దేవాలయంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీ సేవ, రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్,గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు పాండు, నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రైవేటుపరం చేయొద్దు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: విద్య, వైద్యరంగాలను ప్రభుత్వ అ. దీనంలో కొనసాగించాలని ఏఐఎఫ్ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, అమరజీవి కామ్రేడ్ ఓంకార్ శత జయంతి వార్షికోత్సవం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో 11న సంగారెడ్డి టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించనున్న వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు విద్య, వైద్యరంగాలపై సవతితల్లి ప్రేమ చూపుతూ కార్పొరేట్ పరం చేస్తున్నాయన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు అరుణ్, రవి, సురేశ్, రాజు, రాకేష్ పాల్గొన్నారు.

నెరవేరిన మత్స్యకారుల కల..


ప్రొసీడింగ్స్ కాపీని అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మత్స్యకారులు కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం ఫలించింది. జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఊట్ల, దాదిగూడెం ప్రజల పరస్పర అవగాహన, నీలం మధు సంపూర్ణ సహకారంతో దాదిగూడెంకు నూతన మత్స్యకార సంఘం ఏర్పడింది. ఊట్ల నుంచి దాదిగూడెం మత్స్యకారులకు చేపలు పెంచుకునేందుకు 5 కుంటలను కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్స్ కాపీని శనివారం నీలం మధు గ్రామస్తులకు అందచేశారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ దాది గూడెం మత్స్యకారులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, టీఎంపీఎస్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, దాది గూడెం అధ్యక్షుడు దాది రమేష్, మత్స్యకారులు మోతె కృష్ణ, ఆంజనేయులు, కృష్ణ, భాస్కర్, మధు, నర్సింగ్ రావు, రాజు,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో వినాయకుడి లడ్డూ వేలం


వినాయకుడికి పూజలు చేస్తున్న సుభాష్‌రెడ్డి దంపతులు

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన అందోల్ రంగనాథ దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహ నిర్వాహకులు వినూత్నంగా వాట్సాప్‌లో లడ్డూను వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న రంగనాథ స్వామి భక్తులు 15 మంది పోటాపోటీగా పాల్గొన్నారు. దుబాయ్‌లోని ఖతర్‌లో ఉండే వ్యాపారి బుయ్యని ప్రవీణ్ రూ.1.16 లక్షలు పాడగా అందోల్‌కు చెందిన అబ్బ సుభాష్‌రెడ్డి రూ.1.21 లక్షలు పాడి దక్కించుకున్నారు. రంగనాథ స్వామి దేవాలయానికి చెందిన వాట్సాప్ గ్రూపులో ఉన్న వందలాది భక్తులు ఈ వేలం పాటను అర్ధరాత్రి వరకు ఆసక్తిగా చూశారు. లడ్డూను దక్కించుకున్న అబ్బ సుభాష్‌రెడ్డిని నిర్వాహకులు అభినందించారు.

టమాటా లారీ బోల్తా..

ట్రాఫిక్‌కు అంతరాయం

జహీరాబాద్: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు టమాటా లోడ్‌తో వెళుతున్న లారీ శనివారం ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉదయం లారీ బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న టమాట బాక్సులు కింద పడిపోయాయి. కింద పడిన టమాటాలను బాక్సుల్లోకి మార్చారు. ఇందు కోసం ఉదయం నుంచి రాత్రి వరకు సమయం పట్టింది. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. కోహీర్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. దిగ్వాల్ గ్రామంలో వాహనాల వేగాన్ని తగ్గించి ప్రమాదాలను నియంత్రించేందుకు వీలుగా పోలీసులు ప్లాస్టిక్ డ్రమ్ములను ఏర్పాటు చేశారు. వాటిని గమనించిన డ్రైవర్ లారీ వేగాన్ని తగ్గించేందుకు సడెన్ బ్రేక్ వేయడం వల్లే బోల్తాపడి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


దిగ్వాల్ గ్రామంలో బోల్తాపడిన టమాటా లారీ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించారు. ఈ నేథప్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..గురువుల సమాజ నిర్దేశకులని తల్లి తండ్రి తర్వాత మూడో స్థానం గురువుకే దక్కిందని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మునిపల్లి(అందోల్) జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో..


జహీరాబాద్ టౌన్: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ జాఫర్ తదితరులు


రాయికోడ్: జ్ఞాపికలను అందజేసుకున్న హెచ్‌ఎం, టీచర్లు



జిన్నారం: ఉపాధ్యాయులను సన్మానించిన కరస్పాండెంట్